సాక్షి మంచిర్యాల

శుక్రవారం । 28 । మార్చి । 2025

I



గ్లైసిల్ దందా ఆగేనా..?

ఈ ఏడాది సీజన్‌కు ముందే నిషేధిత పత్తి విత్తనం భారీగా పట్టుబడింది. కలుపు నివారణ, కూలీల కొరతను అధిగమించడానికి రైతులు ఈ విత్తనాలు ఎంచుకుంటున్నారు. IIలో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర : 6:25	శని : 4:56

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
39.0 /24.0

ఎండల తీవ్రత మరింతగా పెరుగుతుంది. వడ గాలులు వీస్తాయి. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఎల్లంపల్లి' పరిహారం దరఖాస్తుల పరిశీలన

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల ఆర్డీఓ కార్యాలయంలో ఇదే చివరి అవకాశంగా ఎల్లంపల్లి ముంపు గ్రామాల పరిధిలో మేజర్ డాటర్స్ కింద పరిహారం దరఖాస్తులను పరిశీలించనున్నట్లు ఆర్డీఓ శ్రీనివాసరావు తెలిపారు. 2008లో హాజీపూర్ మండలం గుడిపేట శివారులోని గోదావరి నదిపై ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నిర్మాణంలో హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల పరిధిలో తొమ్మిది గ్రామాలు ముంపునకు గురయ్యాయని తెలిపారు. హాజీపూర్ మండలం గుడిపేట, నంనూర్, చందనాపూర్, రాపల్లి, కొండపల్లి, కర్ణమామిడి, పడ్తనపల్లి, లక్సెట్టిపేట మండలం గుల్లకోట, సురారం గ్రామల మేజర్ డాటర్ దరఖాస్తులు ఏప్రిల్ 5వరకు పరిశీలిస్తామని తెలిపారు. మేజర్ డాటర్ కింద పరిహారం కోసం ఇప్పటివరకు 1,351దరఖాస్తులు రాగా ఇంకా దరఖాస్తు చేసుకోని వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

నేడు బార్ అసోసియేషన్ ఎన్నికలు

మంచిర్యాలక్రైం: జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికల పోలింగ్ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎన్నికల కమిషనర్ అనిల్‌రాజ్ తెలిపారు. జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులుగా 312 మంది ఓటర్లు ఉండగా.. వివిధ పదవుల కోసం 23మంది బరిలో ఉన్నారు. అధ్యక్ష పదవి కోసం నలుగురు న్యాయవాదులు పోటీ పోడుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు బండవరకు జగ్గయ్య, జిల్లా కోర్టులో మూడున్నరేళ్ల పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేసిన పులి రాయమల్లు, గతంలో తొమ్మిది సార్లు అధ్యక్ష పదవిలో కొనసాగిన కొత్త సత్తయ్య, రంగు మల్లేష్ అధ్యక్ష పదవి బరిలో నిలిచారు. ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్, ఐదు గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

వైద్యసిబ్బంది పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద పోస్టుల భర్తీ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని బస్తీ దవాఖానాల్లో మెడికల్ ఆఫీసర్, స్టాఫ్‌నర్సు, సహాయ సిబ్బంది 2, చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోని ఎస్‌సీడీ విభాగంలో స్టాఫ్‌నర్సు పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 28నుంచి ఏప్రిల్ 3వరకు కలెక్టరేట్ కార్యాలయ భవనంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్ https://mancherial.telangana.gov.in లో సంప్రదించాలని తెలిపారు.


కోటిమంది ఖాతాదారులకు సేవలు



భీమారంలో ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శోభ

భీమారం/కాసిపేట: తెలంగాణ వ్యాప్తంగా కోటి మంది బ్యాంకు ఖాతాదారులకు సేవలు అందిస్తున్నామని టీజీబీ చైర్‌పర్సన్ శోభ అన్నారు. గురువారం భీమారం, కాసిపేట మండలం కొండపూర్ యాపలో బ్యాంకు బ్రాంచిలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు సేవలు అందించేందుకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. వివిధ రకాల రుణాలు అందిస్తున్నామని, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అన్ని బ్యాంకుల కన్నా అధికంగా వడ్డీ ఇస్తున్నామని తెలిపారు. మంచిర్యాల రీజనల్ మేనేజర్ మురళీధర్‌రావు, చీఫ్ మేనేజర్ రవికిషోర్, భీమారం బ్రాంచి మేనేజర్ సతీష్ పాల్గొన్నారు.

చెత్తలో కాలం చెల్లిన ఔషధాలు



గ్రీన్‌సిటీ సమీపంలో పడేసిన మందులు

మంచిర్యాలటౌన్: మెడికల్ షాపుల్లో కాలం చెల్లిన మందులను మంచిర్యాల పట్టణంలోని రోడ్ల పక్కన ఇష్టారాజ్యంగా పడేస్తున్నారు. మందులు, సిరప్‌లు, ఇంజక్షన్లు కలిపి వేయడంతోపాటు కాలుస్తున్నారు. సగం కాలిన మందులు రోజుల తరబడి ఉంటున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఆండాళమ్మ కాలనీలోని డంపింగ్ యార్డులో చెత్త నిండిపోవడంతో ప్రధాన రహదారికి దగ్గరగా చెత్త కుప్పలు పేరుకుపోయాయి. డంపింగ్ యార్డులోనూ కాలం చెల్లించిన ఔషధాలు వేస్తుండగా చెత్తలో కలిసిపోయి ప్రమాదకారిగా మారుతున్నాయి.

ఆ ప్లాట్లకు తిప్పలే!



ఈ చిత్రంలో కనిపిస్తున్న ప్లాటు హాజీపూర్ మండలం నబ్బెపల్లి పరిధిలోనిది. ఇక్కడ కడెం కాలువ ఉండడంతో అక్కడ ప్లాట్లు కొనుగోలు చేసిన వారందరివి ఎల్‌ఆర్‌ఎస్ పథకంలో నిలిపివేశారు. ఇప్పటికే ఆ ప్రాంతంలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని, జాతీయ రహదారి పక్కనే ఉందని చాలామంది ప్లాట్లు కొనుగోలు చేశారు. తాజాగా సాగునీటి శాఖ అధికారులు ఎన్‌వోసీ ఇస్తే తప్ప ఫీజు చెల్లించలేని పరిస్థితి నెలకొంది.



	LS officers	Officer Status	Notes
2/2020	GP_R_MAR	Shortfall	site is in proximity to B-2-1 Kadam canal duly certified by revenue department and to obtain NOC from irrigation department

కడెం కాలువ పక్కనే ఉండడంతో నిలిపివేసినట్లు చూపిస్తున్న దరఖాస్తు

- నిషేధిత భూములపై అభ్యంతరాలు
- రెవెన్యూ, సాగునీటి పరిధిలో నిలిపివేత
- 'ఎన్‌వోసీ'లకు భూ యజమానుల కష్టాలు
- ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొందరు రియల్ వ్యాపారులు ప్రభుత్వ, సాగునీటి వనరుల భూములు అని తేడా లేకుండా ఇష్టారీతిన అమ్మేయడంతో కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలోని అనేక చోట్ల చెరువు, శిఖం, కాలువలు, కోర్, బఫర్ తేడా లేకుండా ప్లాట్లుగా చేసి అమ్మేసి సొమ్ము చేసుకున్నారు. నిబంధనల ప్రకారం అలాంటి భూములు కొనుగోలు, అమ్మకాలు చేయరాదు. అయితే జిల్లాలో కడెం, గూడెం ఎత్తిపోతలు, ర్యాలీవాగు ప్రాజెక్టు కాలువలతోపాటు చిన్న వాగులు, వంకలు, వందలాది చెరువులు ఉన్నాయి. జిల్లా కేంద్రంలో చెరువుల సమీపం, కట్టలు, మత్తడి వరకు ప్లాట్లు చేసి అమ్మేశారు. ఇక ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంకు లెవల్) పరిధిలోనూ పట్టా భూములు ఉన్నాయని వెంచర్లు చేసి అమ్మేశారు. గతంలోనే కొన్ని చోట్ల సాగునీటి శాఖ అధికారులు అభ్యంతరాలు చెబుతూ నోటీసులు ఇచ్చారు. దీనిపై కొందరు కోర్టులకు వెళ్లి మరీ స్టేలు, ఆర్డర్లు తెచ్చుకున్నారు. పంట పొలాలనే వెంచర్లుగా మార్చడంతో చాలా చోట్ల సహజ వనరులు కబ్జాలయ్యాయి. పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ ఆక్రమణలు జరిగాయి. ఏడు మున్సిపాలిటీల్లో 39,512 ప్లాట్ల క్రమబద్ధీకరణ కోసం దరఖాస్తులు రాగా, ఇందులో 9500వరకు నిషేధిత భూముల్లో ఉన్నట్లు ప్రాథమిక దశలో నిలిపివేశారు. ఇక పంచాయతీల్లో 15,729 దరఖాస్తులు రాగా, వీటిలో 2500 నిషేధిత భూముల్లో ఉన్నట్లు అధికారులు పరిశీలనలో గుర్తించారు.

'ఎన్‌వోసీ'లకు కష్టాలు..

ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించాలంటే ప్రభుత్వ, సాగునీటి పరిధిలో భూములు లేకుండా ఉంటేనే ఆమోదం లభిస్తున్నాయి. ఎక్కడైనా పరిశీలనలో తేలితే షాట్‌ఫాల్ కింద నమోదు చేసి హోల్డ్‌లో ఉంచుతున్నారు. దీంతో ఆ ప్లాట్ల యజమానులు ఫీజు చెల్లించకుండా నిలిపివేస్తున్నారు. దీంతో అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఎన్‌వోసీ(నో అబ్జక్షన్ సర్టిఫికేట్) ఇచ్చేందుకు రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించి ధ్రువీకరిస్తున్నారు. మరోవైపు కొంతమంది భూములు సాగు నీటిపరిధిలో లేకుండా సంబంధిత ఏఈలు సర్వే నంబరు మొత్తం నిలిపివేశారని ఆరోపిస్తున్నారు. సర్వే చేసేందుకు సిబ్బంది లేకపోవడం, ఎల్‌ఆర్‌ఎస్ గడువు ముగుస్తోందనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో మళ్లీ ప్లాట్ల యజమానుల అర్జీల మేరకు పునఃపరిశీలన చేస్తున్నారు. దీంతో ఎక్కడైనా పొరబాటుగా నమోదైతే తొలగిస్తున్నారు. అయితే ఆయా చోట్ల భూ యజమానులకు హోల్డ్‌లో ఉంటే తిప్పలు తప్పడం లేదు.

నెర్రెలు బారిన పొలం



భీమారం: మండలంలోని ఆర్కెపల్లి శివారులో సాగునీరందక వరి పొలం ఎండిపోతోంది. సమీప వాగునీటిపై ఆధారపడి సాగు చేయగా.. నీరు కరువై సుమారు 30ఎకరాల్లో నెర్రెలు బారింది. సమీపంలోని గొల్లవాగు ప్రాజెక్టు ద్వారా ఆర్కెపల్లి చెరువు నింపితే పంటలు దక్కే వీలుందని రైతులు పేర్కొంటున్నారు. చెరువుకు నీటిని మళ్లించాలని కొన్నేళ్లుగా కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. జిల్లా అధికారులు స్పందించి గొల్లవాగు కాలువ నీటిని ఆర్కెపల్లి చెరువుకు తరలించి పంటలను కాపాడాలని కోరుతున్నారు.

ఉగాది కానుక



రేషన్ బియ్యం పంపిణీ(ఫైల్)

- ఏప్రిల్ నుంచి సన్న బియ్యం పంపిణీ
- ఏర్పాట్లు చేస్తున్న పౌరసరఫరాల శాఖ

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో రేషన్‌కార్డుదారులకు ఉగాది కానుకగా సన్న బియ్యం పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీకి జిల్లా ఉన్నతాధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు రేషన్ డీలర్లతో బుధవారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సన్న బియ్యం సరఫరాలో ఎలాంటి అక్రమాలకు పాల్పడవద్దని సూచించారు. ఇప్పటికే నిల్వ ఉన్న దొడ్డు బియ్యం ప్రభుత్వం తీసుకుంటుందని, దొడ్డు బియ్యం, సన్న బియ్యం వేర్వేరుగా నిల్వ ఉంచాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇప్పటికే ప్రభుత్వ హాస్టళ్లు, కస్తూర్బా పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నారు. సామాన్యులకూ సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఈ నెల కోట 3.5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేయగా.. అందుకు అనుగుణంగా ఏప్రిల్ నెలకు సరిపడా సరఫరాకు నిల్వలను జిల్లాలోని గోదాములకు తరలిస్తున్నారు. కాగా, ఇప్పటివరకు పంపిణీ చేసిన దొడ్డు బియ్యాన్ని తినడానికి ఇష్టపడక కొందరు దళారులకు విక్రయించారు. దళారులు ఇతర ప్రాంతాలకు తరలించి అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటూ దందా సాగిస్తున్నారు. సన్న బియ్యం పంపిణీ చేస్తే పక్కదారి పట్టకుండా ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. బహిరంగ మార్కెట్లో సన్న బియ్యం ధర కిలో రూ.40 నుంచి రూ.60వరకు ఉంది.

జిల్లాలో..

జిల్లాలో 423 రేషన్ దుకాణాలు ఉన్నాయి. అంత్యోదయ, ఆహార భద్రత, అన్నపూర్ణ కార్డులు మొత్తంగా 2,18,892 ఉన్నాయి. ప్రతీ నెల 3.4 నుంచి 3.6 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అందిస్తున్నారు. అంత్యోదయ కార్డుదారులకు 35 కిలోల చొప్పున, సాధారణ తెల్ల రేషన్‌కార్డుదారులకు ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున సరఫరా చేస్తున్నారు. 3.5 వేల మెట్రిక్ టన్నుల బియ్యం జిల్లా గోదాంకు చేరాయి. మార్చి నెల బియ్యం సరఫరా కోట క్లోజింగ్ బ్యాలెన్స్ తెప్పించుకుంటున్నారు. మిగిలిన బియ్యం ప్రభుత్వం తిరిగి తీసుకునేందుకు చర్యలు చేపడుతోంది.

వచ్చే నెల నుంచి పంపిణీ



ఏప్రిల్ నెల నుంచి సన్నబియ్యం పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నాం. బియ్యం ఇప్పటికే ఎంఎల్ఎస్ పాయింట్లకు చేరుతోంది. జిల్లాలో 3.6 వేల మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీకి సిద్ధం చేశాం. రేషన్‌కార్డుల అవసరం మేరకు జిల్లాలోని మిల్లుల నుంచి వచ్చిన సన్నబియ్యం అందుబాటులో ఉంది.

– బ్రహ్మారావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

సమర్థవంతంగా 'మహిళా శక్తి' అమలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



అవార్డు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ఇందిరా మహిళా శక్తి పథకం సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, మెప్మా పీడీ మారుతిప్రసాద్‌లతో కలిసి ఏపీఎంలు, మండల సమాఖ్య నాయకులు, కార్యదర్శులు, సభ్యులు, ఆర్పీలు, సీవోలు, టీఎంసీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. సూక్ష్మ పరిశ్రమల క్రింద 5,684 యూనిట్లు ప్రతిపాదించగా 90శాతం గ్రౌండింగ్ చేసినట్లు తెలిపారు. మొబైల్‌ఫిష్, మిల్క్‌పార్లర్లు, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం విభాగాల్లో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం స్త్రీనిధి పథకంలో మందమర్రి టౌన్ లెవల్ ఫెడరేషన్ సంస్థ రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానంలో నిలిచినందున సంస్థ సభ్యులకు అవార్డు అందజేశారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

మంచిర్యాలఅర్బన్: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో అన్నిరంగాల్లో రాణించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా విద్యాశాఖ, అలింకో సంస్థ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. అలింకో సంస్థ ద్వారా రూ.17.50లక్షల విలువైన వినికిడి యంత్రాలు, ట్రైసైకిళ్లు, బ్రెయిలీ కిట్లు, సీపీ చైర్లు మొత్తం 215 ఉపకరణాలు 85 మందికి అందజేశారు. కార్యక్రమంలో డీఈవో యాదయ్య, ఎంఈవో మాలవీదేవి, సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, యశోధర, శ్రీనివాస్, ఏఎస్‌వో రాజుకుమార్, డీఎస్‌వో మధుబాబు, అలింకో ప్రతినిధులు డాక్టర్ రంజిత్‌రెడ్డి, రిషిగుప్తా, ఐఈఆర్పీలు పాల్గొన్నారు.

కొత్త ప్లాంటు నిర్మాణానికి సంసిద్ధం

- సింగరేణి డైరెక్టర్లు సత్యనారాయణరావు, సూర్యనారాయణ
- ఎస్టీపీపీలో బీహెచ్‌ఈఎల్, సింగరేణి అధికారుల సమావేశం



మాట్లాడుతున్న డైరెక్టర్ సత్యనారాయణరావు

జైపూర్: మండల కేంద్రంలో 1200మెగావాట్ల పవర్ ప్లాంటు విస్తరణలో భాగంగా కొత్తగా నిర్మించనున్న 800 మెగావాట్ల థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదిత స్థలం, అన్ని రకాల సదుపాయాల కలనకు సింగరేణి సంస్థ సంసిద్ధంగా ఉందని సంస్థ డైరెక్టర్లు సత్యనారాయణరావు, ఎల్‌వీ.సూర్యనారాయణ తెలిపారు. స్థానిక ప్లాంటులోని అడ్మిన్ భవన కార్యాలయంలో గురువారం బీహెచ్‌ఈఎల్, సింగరేణి అధికారుల సంయుక్త సమావేశం నిర్వహించారు. బీహెచ్‌ఈఎల్ ఈడీ వినోద్ జాకబ్ సామ్, సింగరేణి డైరెక్టర్లు పాల్గొన్నారు. ఫిబ్రవరిలో 800 మెగావాట్ల సామర్థ్యం గల మూడో యూనిట్ నిర్మాణానికి సింగరేణి, బీహెచ్‌ఈఎల్ మధ్య ఒప్పందం కుదిరిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా తొలి సమావేశంలో ముందస్తు ప్రణాళికలు, సాంకేతిక అంశాలపై సమీక్ష, నిర్మాణ ప్రణాళిక, నాణ్యత, ఆడిట్, బిల్లింగ్ విధివిధానాలపై చర్చించారు. అనంతరం డైరెక్టర్లు మాట్లాడుతూ నిర్ణీత సమయంలో నిర్మాణం పూర్తి చేయాలని, ఏప్రిల్ మొదటి వారంలో పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కే.వెంకటేశ్వర్లు, ఎస్టీపీపీ ఈడీ శ్రీనివాసులు, జీఎం కో ఆర్డినేషన్ సుభానీ, జీఎంలు సుబ్బారావు, సూర్యనారాయణ, ఏజీఎంలు విశ్వనాథరాజు, మురళీధర్, మదన్‌మోహన్, డీజీఎంలు అజ్జుల ఖాన్, ఆజ్మీర తుకరాం, ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎంవీ.వేణుగోపాల్‌రావు, బీహెచ్‌ఈఎల్ అధికారులు ఆశా, శివ చరణ్‌వర్మ, మధుకిరణ్ పాల్గొన్నారు.

'ఈ–పాలన' ఎప్పుడో..!

- పంచాయతీల్లో ఇంటర్నెట్ సేవలు కరువు
- డిజిటల్ సేవలు అందక ప్రజలు ఇబ్బందులు
- టీ–ఫైబర్ సేవల కోసం ఎదురుచూపులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): నేటి ఆధునిక కాలంలో ఇంటర్‌నెట్‌కు ఎంతో ప్రాధాన్యత ఉంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ప్రతీ పనికి, సేవకు సాంకేతికత ముడిపడి ఉంది. ప్రతీ గ్రామ పంచాయతీలో ఈ–పాలన, ఇంటింటికీ ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో 2017లో గత ప్రభుత్వం టీ–ఫైబర్ సేవలకు శ్రీకారం చుట్టింది. గ్రామాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు, బ్యాంకులు, రైతువేదికలు, ఇతర ప్రజాసేవల సంస్థలకు అధిక వేగంతో కూడిన ఇంటర్‌రెట్ సౌకర్యం కల్పించేందుకు టీ–ఫైబర్ ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ పనుల సమయంలోనే టీ–ఫైబర్ కేబుల్ వేశారు. పంచాయతీ కార్యాలయాల్లో టీ ఫైబర్ కేబుల్, విద్యుత్ సౌకర్యం, ఇన్వర్టర్, బ్యాటరీలు, పరికరాలను అమర్చారు. పారదర్శకత, జవాబుదారీతనం, డిజిటల్ సేవల లక్ష్యంతో క్లస్టర్ల వారీగా ఈ–పంచాయతీ వ్యవస్థ అమల్లోకి తీసుకొస్తూ ఆపరేటర్లను నియమించి కంప్యూటర్లు, ప్రింటర్లు అందించారు. జిల్లాలో 311(ప్రస్తుతం 306) గ్రామ పంచాయతీలకు గాను 25 మంది ఆపరేటర్లుగా ఉన్నారు. ఆదాయ, వ్యయాలు, జీతభత్యాలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు, నిధుల కేటాయింపులు, ఇంటి పన్నులు, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు తదితర పౌర సేవలతోపాటు ఇళ్లు, వ్యవసాయేతర ఆస్తులను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ డిజిటల్ రూపంలో సేవలు అందుబాటులోకి తీసుకురావాలని భావించింది. ఇంటర్‌నెట్ సౌకర్యం అందుబాటులోకి రాకపోవడంతో ఈ–పాలన జాడలేకుండా పోయింది. గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోని ఆపరేటర్లు మండల పరిషత్ కార్యాలయాల్లో పని చేస్తున్నారు.



దొనబండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అమర్చిన టీ–ఫైబర్ పరికరాలు

అందుబాటులోకి వస్తే..

ప్రస్తుతం పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాలు, నామినేషన్లు, ఎన్నికల నిర్వహణ, విజేతల వివరాల నమోదు ఇలా ప్రతీ పని ఇంటర్‌నెట్ ద్వారానే జరగాల్సి ఉంది. గ్రామాల్లో సేవలు అందుబాటులో లేకపోవడంతో మండల పరిషత్ కార్యాలయాలకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ఇంటర్‌నెట్ సేవలు ప్రారంభించకముందే విద్యుత్ సౌకర్యం కోసం మీటర్లు బిగించడంతో సేవలు లభించకపోగా పంచాయతీలు మాత్రం రూ.వేలల్లో విద్యుత్ బిల్లులు చెల్లించక తప్పడం లేదు. ఎన్నికలు జరిగే నాటికి టీ–ఫైబర్ వ్యవస్థ అందుబాటులోకి తీసుకువస్తే డిజిటల్ సేవలు అందుతాయి.

ఉన్నతాధికారుల దృష్టికి..



పంచాయతీల్లో ఏర్పాటు చేసిన టీ–ఫైబర్ వ్యవస్థకు సంబంధించి ఎలాంటి సేవలు అందడం లేదు. పరికరాల బిగింపు, సోలార్ సిస్టమ్ ఏర్పాటు వంటి పనులు పూర్తి చేసినా ఇంటర్‌నెట్ సేవలు అందుబాటులోకి రాలేదు. ఇంటర్‌నెట్ ఉంటే సేవలతోపాటు పనులు సులభతరం అవుతాయి. ఇందుకు టీ–ఫైబర్ సేవలు అందుబాటులోకి వచ్చేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

– వెంకటేశ్వర్‌రావు, డీపీఓ, మంచిర్యాల

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతీ ఒక్కరికి అందించే విధంగా కృషి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ అన్నారు. గురువారం సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌తో కలిసి జిల్లా కలెక్టర్లు, అడిషనల్ కలెక్టర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యూనిక్ డిజేబులిటీ ఐడీ కార్డుల జారీ, దివ్యాంగులకు సదరం శిబిరాల నిర్వహణ, మరణించిన వృద్ధాప్య పింఛన్‌దారుల స్థానంలో స్పౌజ్‌లకు పింఛన్ మంజూరు చేయాలని, మహిళా సంఘాలకు పెట్రోల్ బంకుల నిర్వహణ, ఏకరూప దుస్తుల తయారీ కేటాయించాలని తెలిపారు. జిల్లాలో చేపట్టిన చర్యలపై జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ రబీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో భాగంగా ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలకు ఎక్కువ సంఖ్యలో కేటాయించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మోతీలాల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి కిషన్, జిల్లా పౌరసరఫరాల అధికారి బ్రహ్మారావు, జిల్లా మేనేజర్ శ్రీకళ, ఎల్‌డీఎం తిరుపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఆంధ్రా డ్రైవర్ మృతి

గుడిహత్నూర్: మండలంలోని మన్నూర్ సమీపంలో జాతీయ రహదారి 44పై సాయి నగర్ వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మహారాష్ట్రలోని అమరావతి నుంచి హైదరాబాద్‌కు నారింజ పండ్ల లోడ్‌తో బయలుదేరిన ఐచర్ వాహనం మన్నూర్ సాయినగర్ వద్ద నిలిపి ఉన్న సిమెంటులోడ్ లారీని వేగంగా ఢీకొంది. ఘటనలో ఏపీలోని కనిగిరి జిల్లాకు చెందిన ఐచర్ డ్రైవర్ మల్లికార్జున్ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి ఐచర్ క్యాబిన్‌లో చిక్కుకున్న మృతదేహాన్ని స్థానికుల సాయంతో బయటకు తీసి రిమ్స్‌కు తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ..

నర్సాపూర్(జి): మండలంలోని తురాటి ఎక్స్‌రోడ్డు వద్ద బైక్ ఢీకొన్న ఘటనలో మహిళ మృతి చెందినట్లు ఏఎస్సై శంకర్ తెలిపారు. తురాటి గ్రామానికి చెందిన బొడికరి లక్ష్మి (52), నారాయణ దంపతులు బుధవారం రాత్రి నిర్మల్‌లో పని ముగించుకుని ఆర్టీసీ బస్సులో తురాటి గ్రామ ఎక్స్ రోడ్డు వద్ద దిగారు. ఎన్‌హెచ్ 61 రోడ్డు క్రాస్ చేస్తుండగా కుంటాలకు చెందిన తోట గజేందర్ బైక్‌పై అతివేగంగా వచ్చి లక్ష్మిని ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. 108లో నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి భర్త నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

బావిలోపడి బాలుడు...

ఇచ్చోడ: ప్రమాదవశాత్తు బావిలోపడి బాలుడు మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సాపూర్‌లో చోటు చేసుకుంది. బోథ్ మండలంలని సాకేరా గ్రామానికి చెందిన గుడిసె ధనుష్ (12) తన తల్లి లక్ష్మితో కలిసి బుధవారం బంధువుల ఇంటికి ఫంక్షన్‌కు వచ్చాడు. గురువారం ఉదయం పిల్లలతో కలిసి ఊరి బయట ఉన్న నాగోర్ గురుజ్ మారుతి వ్యవసాయ బావి వద్దకు ఈత కోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

అనారోగ్యంతో యువతి..

భీమిని: కన్నెపల్లి మండలం నాయకునిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్మగుడెంకు చెందిన మేకల రేణుక (20) కొంతకాలంగా చాతిలో నొప్పితో బాధపడుతోంది. ఈ నెల 25న నొప్పి తీవ్రం కావడంతో కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌కు రెఫర్ చేయగా గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి తండ్రి జాతర గొండ బీరయ్య ఫిర్యాదు మేరకు గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహానికి తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎస్సై గంగారాం పంచనామా నిర్వహించారు.

గ్లైసిల్ దందా ఆగేనా?

- సీజన్‌కు ముందే రైతుల చెంతకు
- ఏటా కోట్లలో వ్యాపారం
- మార్చిలోనే 1,126 క్వింటాళ్లు పట్టివేత

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ ఏడాది సీజన్‌కు నాలుగు నెలల ముందుగానే నిషేధిత పత్తి విత్తనాల వ్యాపారం జోరందుకుంది. మార్చిలోనే ఆరు చోట్ల రూ.27,35,000 విలువగల 1,126 క్వింటాళ్ల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకుని 34 మందిపై కేసులు నమోదు చేశారు. కొంతమంది కొన్నేళ్లుగా అక్రమ దందా నిర్వహిస్తూ కోట్లలో వ్యాపారం సాగిస్తున్నారు. పోలీసులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నా దందా మాత్రం ఆగడం లేదు. గ్లైసిల్ విత్తనాలుగా పిలువబడే బీటీ–3, హెచ్‌టీ పత్తి విత్తనాల విక్రయానికి ప్రభుత్వ అనుమతి లేదు. ఈ విత్తనం సాగు చేసిన రైతులు కలుపు నివారణకు ఉపయోగించే గ్లైఫోసెట్ మందు పిచికారీ చేస్తున్నా దిగుబడి తగ్గడంతో పాటు భూసారం కోల్పోతుంది. కలుపు నివారణకు కూలీల కొరతను అధిగమించడానికి రైతులు ఈ విత్తనాలను ఎక్కువగా ఎంచుకుంటున్నారు. రైతుల అవసరాలను ఆసరా చేసుకుని సీజన్‌కు ముందస్తుగా ఆంధ్రప్రదేశ్ నుంచి విత్తనం, మహారాష్ట్ర నుంచి గ్లైఫోసెట్ జిల్లాకు చేరవేస్తున్నారు.

కిలో రూ.2,500 నుంచి రూ.3 వేలు

ఖరీఫ్ సాగులో 3.40 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉంటుండగా ఇందులో పత్తి సాగు అధికంగా ఉంటుంది. రైతులు సొంతభూమితో పాటు పెద్దఎత్తున భూములు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నారు. ఇప్పటికే పత్తి అమ్ముకున్న కొంతమంది రైతులు పంటను తొలగించి రానున్న ఖరీఫ్ సీజన్ కోసం భూమిని చదును చేస్తున్నారు. కలుపు నివారణ కోసం కొన్నేళ్లుగా రైతులు గుర్తింపు లేని విత్తనాలు వినియోగిస్తున్నారు. పత్తి సాగు, రైతుల అవసరాలను అవకాశంగా చేసుకుని విత్తన దందా రాయుళ్లు ముందస్తుగానే విత్తనాలు డంపింగ్ చేసుకుంటున్నారు. ఏటా ప్రభుత్వం నిషేధిత బీటీ–3 పత్తి విత్తనాలు నివారించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా విత్తన విక్రయాలు సాగుతునే ఉన్నాయి. లూజ్‌గా కిలోల చొప్పున విత్తనాలను బస్తాలతో పాటు ఆకర్షనీయమైన ప్యాకింగ్‌లలో నాణ్యత విత్తనాలు పోలిన మాదిరి ప్యాకెట్లు సైతం చేరుతున్నాయి. కిలోకు రూ.1000 నుంచి రూ.1500 వరకు కొనుగోలు చేసి రైతులకు కిలోకు రూ.2,500 నుంచి రూ.3 వేల చొప్పున విక్రయిస్తున్నారు. ఇందులో కొన్ని దిగుబడి వస్తుండగా ఎక్కువశాతం రైతులు నాణ్యత లేక నష్టపోతున్నారు. మోసపోయిన రైతులు బయటకు చెప్పుకుంటే కేసులు నమోదవుతాయని భావించి మిన్నకుండి పోతున్నారు. జనవరి, ఫిబ్రవరి మాసాల్లోనే ఆంధ్రప్రదేశ్ నుంచి మంచిర్యాల, మందమర్రి, భీమిని, కన్నెపల్లి, బెల్లంపల్లి, తాండూర్ ప్రాంతాల్లో నిల్వ చేసినట్లు సమాచారం. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేస్తే రైతులు మోసపోకుండా ఉంటుంది.



ఈ నెల 23న కాసిపేట మండలంలో పట్టుబడిన నకిలీ విత్తనాలు

మూడేళ్లలో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు, నమోదైన కేసులు

సంవత్సరం	కేసులు	క్వింటాళ్లు	విలువ(రూ.ల్లో)	పట్టుబడిన వ్యక్తులు
2022–23	5	1,193	34,50,000	10
2023–24	2	1,310	18,10,000	08
2024–25	11	1,562.5	42,44,400	17
2025–26	6	1,126	27,35,000	34

మూడేళ్లలో 3,975 క్వింటాళ్లు

మూడేళ్ల కాలంలో 18 చోట్ల ఈ నకిలీ విత్తనాలు పట్టుబడగా రూ.95,04,4,000 విలువ గల 3,975 క్వింటాళ్ల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకుని 35 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ ఏడాది దిగుబడి వచ్చిన పంట విక్రయిస్తున్న సమయంలో నకిలీ కేటుగాళ్లు ముందస్తుగానే సరఫరా చేస్తే తనిఖీలు ఉండవని భావించి విత్తన దందాకు తెరలేపారు. ఈఏడాది ఇప్పటి వరకు ఆరుచోట్ల రూ.27,35,000 విలువ గల 1,126 క్వింటాళ్ల విత్తనాలు స్వాధీనం చేసుకుని 34 మందిపై కేసులు నమోదు చేశారు. కొంతమంది బడా వ్యాపారులు కిందిస్థాయిలో ఏజెంట్లను నియమించుకుని రైతుల చెంతకు చేరవేస్తున్నారు. పట్టుబడిన సమయంలో కిందిస్థాయి వ్యక్తులపైనే కేసులు నమోదు చేస్తుండడంతో అసలు సూత్రధారి తప్పించుకోవడం విమర్శలకు తావిస్తోంది. కొన్నేళ్లుగా అక్రమ దందా సాగిస్తున్న వ్యక్తులు ఇది మాకు 'మామూలే' అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో పూర్తిస్థాయిలో అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయడం లేదు. ఈ విత్తన సాగులో కలుపు నియంత్రణకు ఉపయోగించే గ్లైఫోసెట్ గడ్డి నివారణ మందు వాడకం పెరిగిపోతోంది. దీని ద్వారా పర్యావరణం, భూసారం దెబ్బతినడంతో పాటు రైతుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విత్తనాలను నిషేధించాయి. సంబంధిత శాఖ అధికారులు నిషేధిత పత్తి విత్తనాలు రైతులకు చేరకుండా చర్యలు తీసుకోవాలి.

కఠిన చర్యలు తప్పవు



నిషేధిత పత్తి విత్తనా లు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆరుచోట్ల 27.35 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. 34 మందిపై కేసులు నమోదు చేశాం. వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు ని ర్వహిస్తున్నారు. ఈ విత్తనాల వల్ల జరిగే నష్టాలను రైతులకు వివరిస్తున్నాం.

– కల్పన, జిల్లా వ్యవసాయాధికారి, మంచిర్యాల

ఈ ఏడాది మార్చిలో పట్టుబడిన విత్తనాలు

- ఈ నెల 2న దహెగాం మండలం అత్తిని నుంచి భీమిని మండలం వడాల గ్రామానికి 3 క్వింటాళ్ల (రూ.6.85 లక్షల విలువై న) నిషేధిత పత్తి విత్తనాలు తరలిస్తుండగా మల్లిడి క్రాస్ రోడ్డు వద్ద పోలీసులు పట్టుకుని ఐదుగురిపై కేసులు నమోదు చేశారు.
- ఈనెల 9న కన్నెపల్లి మండలం సుర్జాపూర్‌లో రూ.3.50 లక్షల విలువైన 140 కిలోల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకుని ముగ్గు రు వ్యక్తులను అరెస్టు చేశారు.
- ఈనెల 14న మంచిర్యాల రైల్వేస్టేషన్ స మీపంలో ఆటోలో తరలిస్తున్న రూ.1.70 లక్షల విలువైన 100 కిలోల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకుని ఎనిమిదిమందిపై కేసులు నమోదు చేశారు.
- ఈ నెల 23న తాండూర్ మండలం అచ్చులాపూర్, గోపాల్‌నగర్ సమీపంలో డీసీ ఎం వ్యాన్ నుంచి కారులోకి డంపు చేస్తు న్న రూ.6,17,500 విలువైన 247 కిలోల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకుని తొ మ్మిది మందిపై కేసులు నమోదు చేశారు.
- ఈ నెల 23న కాసిపేట మండలం కొండాపూర్‌లో రూ.1,25,000 విలువైన 50 కి లోల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకు ని ఆరుగురిపై కేసులు నమోదు చేశారు.
- ఈనెల 26న బుధవారం కాసిపేట మండలంలోని దేవాపూర్‌లో రూ.7,87,500 విలువైన 315 కిలోల పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన హరిప్రియ

నిర్మల్‌టౌన్: వికారాబాద్ జిల్లాలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో నిర్మల్‌కు చెందిన విద్యార్థిని హరిప్రియ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికై ంది. శుక్రవారం బీహార్ రాష్ట్రంలో జరుగనున్న సబ్ జూనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది. జిల్లా క్రీడల శాఖ అధికారి శ్రీకాంత్‌రెడ్డి, నిర్మల్ సబ్ జూనియర్ కబడ్డీ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూపతిరెడ్డి, ఇన్‌చార్జి ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బర్కుంట సునీల్ ప్రత్యేకంగా అభినందించారు. జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

డీఎంహెచ్‌ఓ కార్యాలయ ఆవరణలో మంటలు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని వైద్యారోగ్య శాఖ కార్యాలయ ఆవరణలోని చెట్ల పొదల్లో గురువారం మంటలు చెలరేగాయి. గమనించిన కార్యాలయ సిబ్బంది అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఇద్దరికి జరిమానా

ఆదిలాబాద్‌టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన ఇద్దరికి ఆదిలాబాద్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గుండ రామస్వామి రూ.600 చొప్పున జరిమానా విధించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ తెలిపారు. గురువారం వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25న రామ్‌లీలా మైదానంలో బండి సత్యనారాయణ, స్థానిక డైట్ కళాశాల మైదానంలో చించేరి వాడకు చెందిన సల్ల రవితేజ బహిరంగంగా మద్యం సేవించడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. విచారించిన మేజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. పట్టణంలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చోటు చేసుకోకుండా పకడ్బందీగా పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

బెల్టుషాపుపై పోలీసుల దాడి

నిర్మల్‌టౌన్: నిర్మల్‌రూరల్ మండలంలోని రాణాపూర్‌లో గురువారం బెల్ట్‌షాపుపై దాడులు నిర్వహించి అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం పట్టుకున్నట్లు ఏఎస్పీ రాజేశ్ మీనా తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి గ్రామానికి చెందిన ఆడే చందులాల్ కిరాణా దుకాణంలో తనిఖీలు నిర్వహించగా కింగ్ ఫిషర్ బీర్ బాటిళ్లు–75, ఒరిజినల్ ఛాయిస్ 90 ఎంఎల్ బాటిళ్లు–110, రాయల్ స్టాగ్ 180 ఎంఎల్ బాటిళ్లు –47, ఎంసీ 180 ఎంఎల్ బాటిళ్లు–52, ఇంపీరియల్ బ్లూ 180 ఎంఎల్ బాటిళ్లు–58 లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ.73,187 ఉంటుందన్నారు. బాటిళ్లను స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



పట్టుకున్న మద్యంతో ఏఎస్పీ రాజేశ్ మీనా

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: జైనథ్ మండలంలోని గిమ్మ గ్రామంలో మట్కా నిర్వాహకుడిని అరెస్టు చేసినట్లు జైనథ్ సీఐ డీ.సాయినాథ్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై వీ.పురుషోత్తం సిబ్బందితో కలిసి వెళ్లి దాడులు చేసి మట్కా నిర్వహిస్తున్న ఆవునూరి శ్రీనివాస్‌ను అదుపులోనికి తీసుకుని అతని వద్ద గల రూ.25,000 నగదు, సెల్ ఫోన్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. సామాన్యుల నుంచి డబ్బులు వసూలు చేసి వాటిని గిమ్మ గ్రామానికి చెందిన మాధవ్, మహారాష్ట్రకు చెందిన మట్కా వ్యాపారి అశోక్ సామ్రాట్‌కు పంపుతున్నట్లు గుర్తించారు. ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. పేకాట, మట్కా, గుట్కా, గంజాయి వంటి అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నట్లు తెలిస్తే జైనథ్ సీఐ 8712659916, ఎస్సై 8712659929 నంబర్లకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సాయినాథ్

జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య



శివకుమార్ (ఫైల్)

బెల్లంపల్లి: జీవితంపై విరక్తితో యువకుడు ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జి.రాకేశ్ తెలిపారు. పట్టణంలోని హన్మాన్ బస్తీకి చెందిన మంతెన శివకుమార్ (30) హైదరాబాద్‌లో క్యాబ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఎనిమిదేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. నాలుగేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో శివకుమార్ ఎడమకాలు విరిగింది. ఆరునెలల క్రితం శివకుమార్ భార్య అతన్ని వదిలివెళ్లి వేరే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఒంటరి జీవితం భరించలేక గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి మంతెన రామక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి..

బెల్లంపల్లి: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు బెల్లంపల్లి రైల్వే హెడ్ కానిస్టేబుల్ కె.సురేశ్‌గౌడ్ తెలిపారు. గురువారం మధ్యాహ్నం సిర్పూర్ టౌన్ నుంచి భద్రాచలం రోడ్ వెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. మృతుడు గుండు చేయించుకుని ఉన్నాడని, సుమారు 45 ఏళ్ల వయస్సు ఉంటుందని, ఎల్లో కలర్ నెక్ టీ షర్ట్, గ్రీన్ కలర్ షార్ట్ ధరించి ఉన్నాడని, వివరాలు ఏమీ తెలియలేదన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీలో ఉంచామని, సమాచారం తెలిసిన వారు 9948481902 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు..

ఉట్నూర్‌రూరల్: ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని శ్యాంపూర్‌కు చెందిన ఎం.బాబు (48) కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యానికి గురికావడంతో మనస్తాపం చెందాడు. గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా మృతుని భార్య దృపద కుష్టు వ్యాధితో బాధపడుతోంది. ఆమెను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని బీజేపీ నాయకులు కాటం రవీందర్ కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

భర్త మద్యం మానేయడంలేదని భార్య..

భర్త మద్యం మానేయడంలేదని భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వంకతుమ్మలో చోటు చేసుకుంది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన ఆత్రం విమల (20) భర్త జ్ఞానేశ్వర్ తరచూ మద్యం సేవిస్తుండడంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. మద్యం మానేయాలని ఎంతచెప్పినా వినిపించుకోకపోవడంతో మనస్తాపానికి గురైంది. బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చిట్టీల పేరుతో మోసగిస్తున్న వ్యక్తి రిమాండ్

మండలంలోని నవోదయనగర్ గ్రామానికి చెందిన జావిద్ పలువురిని చిట్టీల పేరుతో మోసం చేస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై మనోహర్ తెలిపారు. పూర్తి విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

'కడెం'లో పూడికతీత

కడెం ప్రాజెక్టులో అనేక ఏళ్లుగా పేరుకు పోయిన పూడికతీత (సిల్ట్)కు టెండర్ ఖరారైనట్లు సమాచారం. పూడి కతీతతో కడెం ప్రాజెక్టులో నీటి నిల్వ సామర్థ్యం పెరుగనుందని ఆయకట్టు రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

- టెండర్ ఖరారు?
- పనులు దక్కించుకున్న ఓ ప్రైవేటు ఏజెన్సీ

కడెం: కడెం నదిపై ఎత్తయిన సహ్యాద్రి కొండలను ఆనుకుని 9 వరద గేట్లతో 1958లో ప్రాజెక్ట్‌ను నిర్మించారు. అదే ఏడాది సామర్థ్యానికి మించి వరద రావడంతో ప్రాజెక్ట్ తెగిపోయింది. కడెం ప్రాజెక్ట్‌కు వచ్చే ఇన్‌ఫ్లో అంచనా వేసినా అప్పటి ప్రభుత్వం మరో 9 వరద గేట్లను పెంచి ప్రాజెక్ట్ ఔట్ ఫ్లో సామర్థ్యాన్ని 3 లక్షల వరకు పెంచింది. కడెం ప్రాజెక్టు నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని కడెం, దస్తురాబాద్, జన్నారం, దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట, మంచిర్యాల మండలాల్లోని 68,150 ఎకరాలకు సాగు నీరందిస్తుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు(7.603 టీఎంసీ). ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే వరదనీటితో చెత్తాచెదారం, మట్టిని ఎప్పటికప్పుడు బయటకు విడుదల చేసేందుకు అప్పటి ఇంజినీర్లు ప్రాజెక్ట్ అడుగుభాగాన గేట్లను ఏర్పాటు చేశారు. కానీ వాటిని ఆపరేట్ చేయకపోవడంతో తుప్పుపట్టిపోయాయి. దీంతో కాలక్రమేణా ప్రాజెక్ట్‌లో సుమారు 4 టీఎంసీల మేర పూడిక ఉన్నట్లు సమాచారం. ప్రాజెక్టు నిండా పూడిక పేరుకుపోవడంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గి ఆయకట్టు కింద ఒకేపంటకు పూర్తిస్థాయిలో సాగునీరు అందిస్తుంది.



కడెం ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడిక

ఎట్టకేలకూ మోక్షం..

రాష్ట్రంలోని ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడిక తీయాలని గతేడాది అక్టోబర్‌లో రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఇందుకు కడెం ప్రాజెక్ట్‌ను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారు. ఓ ప్రైవేట్ ఏజెన్సీ పూడికతీత పనులకు టెండర్ దక్కించుకున్నట్లు సమాచారం. ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడికతీత 15 ఏళ్లవరకు దశలవారీగా చేపట్టనున్నారు. పూడికతీత ప్రక్రియలో భాగంగా పూడికలో ఇసుక, పొలాలకు సారవంతమైన మట్టి, గ్రావెల్ మూడు భాగాలుగా వేరు చేయనున్నారు. కడెం ప్రాజెక్టు పూడికతీత ద్వారా సుమారు రూ.200 కోట్ల ఆదాయం సమకూరనున్నట్లు సమాచారం.

సమాచారం లేదు

కడెం ప్రాజెక్టులో పేరుకుపోయిన పూడిక తీసివేయాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్ట్‌లో సిల్ట్ పేరుకుపోవడంతో నీటినిల్వ సామర్థ్యం తగ్గింది. టెండర్ ప్రక్రియ అనేది కరీంనగర్‌లో జరుగుతుంది. దీనిపై ఉన్నతాధికారుల నుంచి మాకు ఎలాంటి సమాచారం లేదు.

– నవీన్, డీఈఈ, కడెం

హోటళ్లు, రెస్టారెంట్లపై దాడులు



జరిమానా రసీదు ఇస్తున్న కమిషనర్

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెస్టారెంట్‌లు, హోటళ్లపై గురువారం మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు దాడులు నిర్వహించారు. పరిశుభ్రత పాటించని హయాన్ బార్, రెస్టారెంట్, సితార గ్రాండ్ హోటల్‌కు రూ.500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ హోటళ్లు, రెస్టారెంట్లలో పరిశుభ్రత పాటించడంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన ఆహార పదార్థాలను అందించాలన్నారు. నిబంధనలు పాటించని హోటళ్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

చింతగూడ ఆలయంలో చోరీ

జన్నారం: మండలంలోని చింతగూడ శ్రీ లక్ష్మీదేవి ఆలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి యత్నించినట్లు ఆలయ ఈవో ముక్త రవి తెలిపారు. గురువారం ఉదయం అర్చకుడు ఆలయానికి వచ్చేసరికి గేటు తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోపలికి వెళ్లి పరిశీలించగా అమ్మవారి వెండి ముక్కుపుడక కనిపించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ

- మూడున్నర గంటల పాటు క్యాబిన్‌లోనే డ్రైవర్

కాసిపేట: రోడ్డుపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టిన ఘటనలో మూడున్నర గంటలపాటు డ్రైవర్ క్యాబిన్‌లోనే చిక్కుకుని నరకయాతన అనుభవించాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కాసిపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని సోమగూడెం ఫ్లై ఓవర్‌పై గురువారం తెల్లవారుజామున ఇనుపరాడ్‌ల లోడ్‌తో ఆగి ఉన్న లారీని ఛత్తీస్‌గఢ్‌లోని బిలాయి నుంచి ఐరన్ షీట్ల లోడుతో వచ్చిన మరోలారీ ఢీకొట్టడంతో క్యాబిన్ నుజ్జునుజ్జయి డ్రైవర్ గురుజీత్‌సింగ్ అందులోనే చిక్కుకున్నాడు. విషయం తెలుసుకున్న కాసిపేట ఎస్సై ప్రవీణ్ కుమార్, హైవే సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మూడున్నర గంటలపాటు శ్రమించి చివరకు గ్యాస్ కట్టర్‌తో క్యాబిన్ కొంత భాగం కట్‌చేసి డ్రైవర్‌ను బయటకు తీశారు. తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.



గ్యాస్ కట్టర్‌తో క్యాబిన్ కట్ చేస్తున్న హైవే సిబ్బంది

నాలుగు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత



కాసిపేట గోదావరిలో ఇసుక ట్రాక్టర్లు

దండేపల్లి: మండలంలోని కాసిపేట గోదావరినది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై తహసినొద్దీన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గురువారం పోలీసులు నదీ తీరానికి చేరుకున్నారు. పోలీసుల రాకను గమనించిన కొందరు ట్రాక్టర్ డ్రైవర్లు తప్పించుకునే ప్రయత్నం చేశారు. ట్రాలీనుంచి ఇంజన్‌ను వేరు చేసి ఇంజిన్లతో బయటకు వచ్చారు. అయినా పోలీసులు ఎవరినీ వదిలిపెట్టలేదు. ట్రాక్టర్ల యజమానులకు సమాచారం ఇచ్చి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తీసుకురావాలని సూచించారు. దీంతో చేసేదేంలేక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరో ట్రాక్టర్ నదిలో దిగబడినట్లు సమాచారం. పట్టుబడిన నాలుగు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఆటో బోల్తాపడి ఒకరికి తీవ్రగాయాలు

బజార్‌హత్నూర్: మండలంలోని దేగామ క్రాస్ రోడ్డు వద్ద ఆటో బోల్తాపడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని ఆందుగూడకు చెందిన కోవ రఘునాథ్ కుటుంబం గురువారం మాడగూడకు ఆటోలో వెళ్లివస్తుండగా దేగామ మూలమలుపు వద్ద ఆటో బోల్తా పడింది. కోవ దినేష్‌కు తీవ్ర, మిగతా వారికి స్వల్పగాయాలు కావడంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. దినేష్‌ను మెరుగైన వైద్యం కోసం రిమ్స్‌కు తరలించారు.